క్లుప్తంగా

దాంపత్య జీవితానికి స్ఫూర్తి ప్రదాతలు సీతారాములు

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె రూరల్: దాంపత్య జీవితానికి స్ఫూర్తిగా నిలిచే సీతారాములను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని తమ జీవితాన్ని సాగించాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని మండలంలోని పలు రామాలయాలను, శ్రీరామ నవమి పందిళ్లను సందర్శించి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

తైక్వాండో పోటీల్లో బోధిధర్మ అకాడమీ క్రీడాకారుల ప్రతిభ



నిజాంపట్నం: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తైక్వాండో వారిచే తెనాలిలో ఈ నెల 2, 3 తేదీలలో నిర్వహించిన ఇండియా తైక్వాండో 5వ రాష్ట్ర స్థాయి పోటీలలో నిజాంపట్నంకు చెందిన బోధిధర్మ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. స్థానిక అకాడమీ కార్యాలయ ఆవరణలో క్రీడాకారులకు ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి, బోధిధర్మ అకాడమీ డైరెక్టర్ మాస్టర్ కే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు ప్రతిభ కనబరచటం ఆనందంగా ఉందన్నారు. బాలుర విభాగంలో కార్తీక్, భువనేశ్, సిద్దు, యశ్వంత్, బాలికల విభాగంలో తనూష, నిధి, సుహానా, జాస్మిత, అక్షర బంగారు పతకాలు సాధించారని తెలిపారు. పతాకాలు సాధించిన క్రీడాకారులను సభ్యులు చంద్రం, బుజ్జి, తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతాకాలు సాధించాలని కోరారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



నిజాంపట్నం: విద్యుత్ ఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపట్నంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపతిరావు తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెం గ్రామానికి చెందిన అక్కల కృష్ణారెడ్డి గత కొంత కాలంగా నిజాంపట్నంలో రొయ్యల చెరువు వద్ద పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో చెరువులో ఫ్యానులు తిరగకపోవటంతో పరిశీలించేందుకు చెరువులో దిగి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు సమాచారం అందించటంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించామన్నారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నామన్నారు.

బాలినేని మాధవిచౌదరి భవనానికి వితరణ



బాపట్ల: వివేకానందకాలనీలో నిర్మిస్తున్న బాలినేని మాధవి చౌదరి భవనానికి ఏసీల నిర్మాణానికి రూ.3.5 లక్షలను బాలినేని మాధవిచౌదరి ట్రస్టు సాయంగా నిలిచింది. బాలినేని సాంబశివరావు కుటుంబ ఆర్థిక సాయంతో భవన నిర్మాణం జరుగుతుంది. వివేకానంద కాలనీలో ఫంక్షన్ హాలు నిర్మించేందుకు ట్రస్టు ముందుకురావటం ఎంతో సంతోషమని కాలనీ ప్రెసిడెంట్ డాక్టరు పీఆర్ ప్రసాద్ తెలిపారు. ఫంక్షన్ హాలును ఆదివారం ప్రారంభించారు.

పేదలకు పాదరక్షలు పంపిణీ



వేమూరు: ఎండలు మెండుగా ఉండటం వల్ల పేదలకు ఉచితంగా పాదరక్షలు అందజేయడం జరిగిందని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలెం రాజు అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా మండల కేంద్రంలోని నిరు పేదలకు ఉచితంగా ఆదివారం పాదరక్షలు పంపిణీ చేశారు. గ్రేస్ ఫౌండేషన్ ద్వారా పేదలకు అనేక ఉచిత సేవలు అందించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పచిగళ్ల అనిల్, అరమళ్ల దేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... సీతారాముల కల్యాణం

- వాడవాడలా శ్రీరామ నవమి వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

రేపల్లె రూరల్: శ్రీరామ నవమి పర్వదిన వేడుకలను నియోజకవర్గంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రేపల్లె పట్టణ, మండలంలోని వివిధ ఆలయాల్లో సీతారాముల విగ్రహాలకు మంగళస్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించారు. మేళతాళాల నడుమ వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి, కోదండ రామస్వామి, మునుసోబువారిపాలెం రామాలయం, పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపం, నేతాజీ నగర్‌కాలనీలో రామ మందిరంలో, మండలంలోని కైతేపల్లి, పెనుమూడి, మోళ్ళగుంట, తుమ్మల, కారుమూరు తదితర గ్రామాలలో రాములోరి కల్యాణ మహోత్సవ వేడుకను వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా పెదకూరగాయల మార్కెట్, ఓపెన్ థియేటర్ వెనుక, పాత స్టేట్ బ్యాంక్ వద్ద తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పానకం, వడపప్పు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నిజాంపట్నంలో...

నిజాంపట్నం: శ్రీరామ నవమి వేడుకలను మండలంలోని పలు గ్రామాలలో భక్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అడవులదీవి గ్రామంలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నవమి వేడుకలను ఘనంగా చేశారు. స్వామి వారి విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించి వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో నెలకొల్పారు. స్వామి వారిని, అమ్మవారిని కల్యాణ మూర్తులుగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ కాలనీలో...

నగరం: శ్రీరామనవమి పర్వదిన వేడుకలు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని మండలంలోని ముదిరాజ్‌వారిపాలెంలోని రామమందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



చినపరిమి అంబేద్కర్ కాలనీలో...



నగరం మండలం కలగానివారిపాలెంలో...



జీఎన్‌పాలెంలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు



రేపల్లె రామకోటిపేటలోని సీతారామయోగిని కల్యాణ మండపంలో...

కల్యాణ మహోత్సవంలో ముఖ్య ఘట్టం తలంబ్రాల కార్యక్రమాన్ని వేద పండితులు కనుల పండువగా జరిపించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను అందజేశారు. అదేవిధంగా కొలగానివారిపాలెం, ధూళిపూడి, పూడివాడ, బెల్లంవారిపాలెం, ఏలేటిపాలెం, మంత్రిపాలెం తదితర గ్రామాలలోని రామ మందిరాలలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో రెడ్ల రామ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. వలివేరులోని రెడ్ల రామ మందిరంలో గ్రామానికి చెందిన దొంతిరెడ్డి మేఘనాథ్ రెడ్డి, అపూర్వ, కారుమూరి బుచ్చి రెడ్డి, నందిని దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ కాలనీలో...

చుండూరు మండలంలోని చినపరిమి అంబేడ్కర్ కాలనీ రామ మందిరంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనుల పండువగా సీతారాముల కల్యాణం నిర్వహించారు.

పిట్టలవానిపాలెంలో...

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): మండల పరిధిలోని పలు గ్రామాలలో రాములోరి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరు, అలకాపురం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం, పిట్టువారిపాలెం, పిట్టలవానిపాలెం, మంతెనవారిపాలెం, చందోలు, సంగుపాలెం, భవనంవారిపాలెం, కోమలి, కొత్తపాలెం గ్రామాలలో శ్రీరామనవమి సందర్భంగా రామాలయాల వద్ద చలువ పందిళ్లు వేసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఉంచి పూలమాలలతో అలంకరించారు. భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ అర్చకులు సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం మండలంలో వాడవాడలా అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం జరిపించేందుకు ప్రత్యేకంగా చలువ పందిళ్లు వేసి మామిడి ఆకుల తోరణాలు కట్టారు. వివిధ రకాల పండ్ల గెలలతో చలువ పందిళ్లకు అలంకారం చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలపై సీతారాముల విగ్రహాలు, చిత్రపటాలను ఉంచి పూలమాలలతో అలంకరించారు. మంగళవాయిద్యాలతో గ్రామస్తులు తీసుకువచ్చిన తలంబ్రాలను స్వామి వారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు వేద మంత్రాల నడుమ సీతారాముల కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చిత్రపటాలకు భక్తులు అక్షింతలు వేసి పూజలు చేశారు. మండలంలోని నాగరాజుపాలెం, దమ్మనవారిపాలెం, దుండివారిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, యాజలి, బుద్ధాం తదితర గ్రామాల రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పానకం వడపప్పు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. నాగరాజుపాలెం, దుండివారిపాలెంలలో భక్తులకు అన్నదానం చేశారు.



రేపల్లె రైలుపేటలోని పట్టాభిరామస్వామి ఆలయంలో...

బాపట్లలో...



బాపట్లలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

బాపట్ల: బాపట్ల పట్టణం, మండలంలోని రామాలయాల్లో ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్యలో పట్టణంలోని శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం వద్ద, భీమావారిపాలెంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన మండపాల్లో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని ముత్తాయపాలెం, ఆదర్శనగర్, రామానగర్, మరుప్రోలువారిపాలెం, అప్పికట్ల తదితర గ్రామాల్లో ఆయా ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయాల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు చేపట్టారు. బాణసంచా, విద్యుత్ వెలుగుల నడుమ సాగిన ఊరేగింపులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



యాజలి కోదండ రామస్వామి ఆలయంలో...



రేపల్లె 10వ వార్డులో...



నిజాంపట్నం మండలంలో సీతారాముల కల్యాణం



వలివేరు గ్రామంలోని రామ మందిరంలో...



ఏట్రవారిపాలెంలో...



నాగరాజుపాలెంలో అన్నదానంలో భక్తులు

శివారులో దాహం కేకలు

- లీకుల సమస్యతో సక్రమంగా సరఫరా కాని నీరు
- నీటి సరఫరాపై లోపించిన ప్రత్యేక దృష్టి

బాపట్ల : పట్టణ శివారు ప్రాంత ప్రజలు దాహం కేకలు పెడుతున్నారు. పైపులైనుల ద్వారా నీటి సరఫరా చేయలేని అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయటంలో కూడా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోకపోవటంతో కొన్ని ప్రాంతాలకు ట్యాంకర్లు తిరుగుతున్నాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ, టీచర్స్‌కాలనీ, ప్యాడిసన్‌పేట, రెల్లి కాలనీ, ఇందిరాకాలనీ, చెంగాళ్‌రాయ్‌తోట, పెయింటర్స్‌కాలనీ, కొత్తపాలెం, డ్రైవర్స్‌కాలనీ, మహాత్మజీపురం, దేవుడు చెరువు, గులాంహుస్సేన్‌తోట, మల్లిఖార్జున బృందావన్‌కాలనీలో నీటి సమస్య ఎక్కువగా ఉంది.

గగ్గోలు పెడుతున్నారు

మంచినీటి పైపుల ద్వారా నీటి సరఫరా చేసే పలు ప్రాంతాల్లో లీకుల సమస్య తీవ్రంగా ఉంది. మంచినీటి పైపులైన్లకు లీకులు ఏర్పడటంతో వచ్చే కొద్దిపాటి నీరు కూడా కలుషితంగా మారిపోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి మనిషికి రోజుకు అన్ని అవసరాలకు 180 లీటర్ల నీటి సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 120 లీటర్లు మాత్రమే నీటి సరఫరా జరుగుతుంది. ఈ లెక్కన ఇచ్చే కొద్దిపాటి నీటిని సద్వినియోగించుకునే విధంగా లీకులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా లీకులు జీబీసీ రోడ్డులోని ప్రధాన పైపులైనుకు ఉండటం.. అక్కడ నుంచి అంతర్గత పైపులైన్లకు వెళ్లటంతో మురుగులు వస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

లోపించిన ప్రత్యేక దృష్టి

నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టడంలో అధికార యంత్రాంగం పూర్తి వైఫల్యం కనిపిస్తోంది. నీటి పంపిణీలో జోన్ల వ్యవస్థను కొనసాగిస్తే వాల్స్‌ను కట్టడి చేసుకుంటూ కొన్ని పైపులైన్లు చివర నీటిని సరఫరా చేసేందుకు అవకాశం ఉంది. అయితే జోన్ల వ్యవస్థ లేకపోవటంతో పైపులైన్ల ద్వారా మొదట్లో గృహాలకు ఎక్కువ సమయం నీటి సరఫరా జరిగి, చివరి ప్రాంతాలకు కనీసం పది నిమిషాలు కూడా నీటి సరఫరా జరగటం లేదు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఉన్న నీరు జూన్ నెలాఖారు వరకు వచ్చే అవకాశం ఉండటంతో సరఫరాలో జాగ్రత్తలు తీసుకుని అన్ని ప్రాంతాలకు సజావుగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సమ్మర్ స్టోరేజీ ట్యాంకు



దగ్గుమల్లివారిపాలెం వద్ద లీకులుపడిన పైపులైను (ఫైల్)



శివారు ప్రాంతాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా

పేదల ఆరోగ్యాన్ని గాలికొదిలేయటం తగదు

- ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేయాలి
- వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అతిక్



రేపల్లె రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో పేదల ఆరోగ్యాన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ అతిక్ అన్నారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో పేదల ఆరోగ్యం ప్రమాదంలో పడిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ బిల్లులు సకాలంలో చెల్లించకపోవటంతో పథకం పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్కరూపాయి కూడా కేటాయింపులు జరపలేదని, వేల కోట్ల రూపాయలు వైద్యశాలకు బకాయిలు పేరుకుపోవటంతో యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తు నిర్ణయం తీసుకుని ఇప్పటికే ప్రకటించాయన్నారు. డబ్బు లేని కారణంగా ఏ నిరుపేద ప్రాణం విడవకూడదన్న లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని దిగ్విజయంగా అమలు చేశారన్నారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలతో పథకం పూర్తిగా కుంటుపడుతోందన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం బిల్లులు సకాలంలో మంజూరు చేయటంతో పాటు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచాలన్నారు. లేని పక్షంలో ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పూరిగృహం దగ్ధం.. ఆర్థిక సహాయం అందజేత

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): ప్రమాదవశాత్తు పూరిగృహం దగ్ధమై రూ.50 వేల ఆస్తి నష్టం జరిగిన ఘటన మండల పరిధిలోని నల్లమోతువారి పాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. వీఆర్వో వెంకట విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు నల్లమోతువారి పాలెంకు చెందిన రాచూరి సాంబయ్య ఆదివారం మధ్యాహ్నం తన గృహంలో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు ఎగసి గృహానికి అంటుకుని పూర్తిగా దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో వంటపాత్రలు, దుస్తులు, రూ.10 వేల నగదు దగ్ధమయ్యాయని వీఆర్వో చెప్పారు. అగ్ని ప్రమాద బాధితుడికి స్థానిక టీడీపీ నాయకులు రూ.10 వేల నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు. అందజేసిన వారిలో మాడా శ్రీనివాసరావు, మునిపల్లె చిన్న, గరిగంటి శ్రీనివాసరావు, మురళీకృష్ణ, రాంబాబు, అప్పారావు ఉన్నారు. బాపట్ల ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అగ్ని బాధితుడు సాంబయ్యకు రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి, గౌరవ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల యజ్ఞ సురేష్, సువర్ణరాజు, నాగరాజు, రమేష్, కోటేశ్వరరావు, సుబ్బారావు యుగంధర్ ఉన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు

పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

అమర్తలూరు(వేమూరు): పార్టీ కోసం పని చేసిన నాయకులను, కార్యకర్తలను గుర్తించి వారికి పదవులు ఇవ్వడం జరుగుతుందని పార్టీ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామానికి చెందిన బొట్టు మోషే నియోజకవర్గ ఉద్యోగుల పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఇంటూరు గ్రామానికి చెందిన బొట్టు మోషే, వైఎస్సార్‌సీపీ నాయకులు చెరుకపల్లిలోని వరికూటి అశోక్‌బాబు స్వగృహంలో ఆదివారం ఆయనను కలిశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ బొట్టు మోషే ఉద్యోగ విరమణ చేసిన తర్వాత రాజకీయాల్లోకి వచ్చి గ్రామ సర్పంచ్‌గా, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా పని చేశారన్నారు. పార్టీ కోసం నిరంతరం పని చేసే నాయకుడని, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తారని అందుకే నియోజకవర్గ ఉద్యోగుల పెన్షనర్ల విభాగం అధ్యక్షుడి పదవి ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది గుమ్మడి రవి రాజా, అవుతు ముత్తరెడ్డి, పి.రాజు, పి.పోలు రాజు, ఇంటూరు వీరాంజనేయులు, కర్ణపూడి సువర్ణ, షేక్ బాజీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



బొట్టు మోషేకు సన్మానం చేసి అభినందించిన వరికూటి అశోక్‌బాబు

పేదలకు అన్నదానం

తెనాలి: శ్రీరామనవమి సందర్భంగా వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్ సెంటరులో పేదలకు అన్నదానం చేశారు. కేఎల్ఎస్ వారి అమ్మ ఫ్రూట్స్, మొవ్వా పున్నయ్య, సుహాసిని కుటుంబసభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ తాడిబోయిన బ్రహ్మం, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడారు.

కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ

తెనాలి టౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న కిడ్నీ వ్యాధి బాధితురాలికి శ్రీ ఆంజనేయ ధ్యాన యోగా మండలి ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ కొనియాడారు. స్థానిక కొత్తపేటలోని విశ్వకర్మ దేవాలయ ఆవరణలో ఆదివారం శ్రీరామనవమి పండుగ సందర్భంగా దేవస్థానం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. 2వ జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం కిడ్నీ వ్యాధి బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేశారు. రెండు కిడ్నీలు పాడై బాధపడుతున్న లలితకుమారికి ప్రతి నెలా 10కిలోల బియ్యం ధ్యాన యోగ మండలి ద్వారా అందజేస్తున్నట్లు కిశోర్ గురూజీ తెలియజేశారు. కార్యక్రమంలో దాతలు వీరయ్య, రాజారెడ్డి, వివేకానంద మూర్తి, యోగా సభ్యులు తాడికొండ శ్రీనివాసరావు, నాగరాజు, కోమలాదేవి, ఎం.శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సుబ్బారావు, ఇస్మాయేల్, రాంబాబు, విద్యకుమారి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్ర గాయాలపాలైన ఘటన కొల్లిపరలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామంలోని హోలీ క్రాస్ స్కూలు వద్ద కేసన కోటేశ్వరమ్మ రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను కొల్లిపర వైద్యశాలకు తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర వైద్యశాలకు పంపారు. వాహనాన్ని మైనర్లు నడిపినట్టు సమాచారం. ఘటనపై కొల్లిపర పోలీసులు విచారిస్తున్నారు.